సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



ఇంట గెలిచారు!

సొంతూరులో ఆ ఇద్దరు అభ్యర్థులకు జనాధరణ లభించింది. రెండు గ్రామాల్లో భారీగా ఓట్లు పోలయ్యాయి. 8లో▸



మోటార్‌లో రాళ్లు వేసి..

గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లలో చిన్న చిన్న రాళ్లు వేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. 8లో▸



ఓటర్లు డబ్బుకు లొంగలేదు

బీఆర్‌ఎస్‌ నాయకులు పంచిన డబ్బులకు కొడంగల్‌ ఓటర్లు లొంగలేదని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్‌

కేసీఆర్‌ను కలిసిన కాలె యాదయ్య



చేవెళ్ల: ఎన్నికల్లో చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలె యాదయ్య మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎర్రవల్లిలోని కేసీఆర్‌ ఫామ్‌హౌస్‌లో ఆయనను కలిసి తన గెలుపు పత్రాన్ని ఆయన చేతుల మీదుగా అందుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు యాదయ్యను కేసీఆర్‌ అభినందించారు.

ఆమనగల్లులో ఆధిక్యత చాటుకున్న బీజేపీ

ఆమనగల్లు: అసెంబ్లీ ఎన్నికల్లో ఆమనగల్లు మండలంలో బీజేపీ ఆధిక్యత చాటుకుంది. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు మండలాలు ఉండగా ఆరు మండలాల్లో కాంగ్రెస్‌ ఆధిక్యతను ప్రదర్శించగా ఒక్క మండలంలో బీజేపీ మెజారిటీ కనబరిచింది. బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆచారి సొంత మండలమైన ఆమనగల్లులో ఆయన ఆధిక్యత కనబర్చారు. గతంలో కూడా ఆమనగల్లు మండలంలో బీజేపీకే మెజార్టీ ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఆచారికి 14,257 ఓట్లు, కాంగ్రెస్‌ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి 5,602 ఓట్లు, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు 4,528 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 8,655 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత ఎన్నికల్లో 6 వేలకు పైగా మెజార్టీ రాగా ఈ ఎన్నికల్లో మరింత పెరగడం విశేషం. ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆచారికి అధికంగా ఓట్లు వచ్చాయి.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు




మాట్లాడుతున్న ఏసీపీ కేఎస్‌రావు

ఇబ్రహీంపట్నం: మంచాల పీఎస్‌ పరిధిలో ఆరేళ్ల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో సోమవారం ఎల్బీనగర్‌ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేఎస్‌ రావు, మంచాల సీఐ కాశీ విశ్వనాథ్‌, ఎస్‌ఐ రవినాయక్‌ వివరాలు వెల్లడించారు. 2017లో మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ సభావత్‌ అంజిత్‌ కుమార్‌(28) గ్రామానికి చెందిన బాలికపై ప్రేమ పేరిట అత్యాచారం చేశాడు. అప్పటి సీఐ గంగారాం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎల్బీనగర్‌ న్యాయస్థానంలో కేసును విచారించిన జడ్జి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రూ.10లక్షల పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన ఐఓ గంగారం, ఏపీపీ సునీత, కోర్టు డ్యూటీ ఆఫీసర్‌ రాజేశ్వరి (డబ్లూపీసీ 1045)ని రాచకొండ కమిషనర్‌ డీఎస్‌ చౌహాన్‌ అభినందించారని.. వారికి రివార్డులను అందజేయనున్నట్లు ఏసీపీ కేఎస్‌ రావు తెలిపారు.

మెజార్టీ పెరుగుతూ వచ్చి.. స్వల్ప తేడాతో గట్టెక్కి

మొయినాబాద్‌: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కాలె యాదయ్య స్వల్ప మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదట్లో ఆయన మెజార్టీ పెరుగుతూ వచ్చింది. అయితే మొయినాబాద్‌, షాబాద్‌, చేవెళ్ల మండలాల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి భీంభరత్‌కు లీడ్‌ ఇచ్చాయి. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి యాదయ్యకు నవాబ్‌పేట్‌ మండలంలో 1,966 ఓట్ల మెజార్టీ, శంకర్‌పల్లి మండలంలో 5000 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్‌ అభ్యర్థి భీంభరత్‌కు మొయినాబాద్‌ మండలంలో 1,760 ఓట్ల మెజార్టీ, షాబాద్‌ మండలంలో 1,564 ఓట్ల మెజార్టీ, చేవెళ్ల మండలంలో 2,100 ఓట్ల మెజార్టీ వచ్చింది. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లలోనూ కాంగ్రెస్‌ అభ్యర్థికి 575 ఓట్ల లీడ్‌ వచ్చినప్పటికీ కాంగ్రెస్‌ అభ్యర్థి విజయాన్ని అందుకోలేకపోయారు. శంకర్‌పల్లి మండలంలో యాదయ్యకు ఏకంగా 5000 ఓట్ల ఆధిక్యం రావడంతో చివరికి 268 ఓట్లతో గట్టెక్కారు.

తేడా ఎక్కడ?



బీఆర్‌ఎస్‌లో అంతర్మథనం

- షాద్‌నగర్‌, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తిలో పరాజయానికి కారణాలేమిటి?
- ఆయా స్థానాల్లో ఓటమిపై విశ్లేషణ
- ఓటింగ్‌ సరళిపై అధిష్టానం ఆరా..!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల్లో అంతర్మథనం మొదలైంది. పదేళ్లుగా అధికారంలో ఉండి.. ప్రభుత్వం నుంచి రూ.వందల కోట్లు వచ్చేలా చేసి నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించినప్పటికీ.. సంస్థాగతంగా ఓటర్ల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి రావడానికి కారణాలేమిటనే అంశంపై లోతైన విశ్లేషణ మొదలైనట్టు సమాచారం. నిజానికి మొదటి నుంచి పార్టీకి పెద్దగా పట్టులేని మహేశ్వరం, ఎల్బీనగర్‌ నియోజక వర్గాల్లోనూ బోణీ కొట్టింది. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్‌ పవనాలు వీస్తున్నా..ఇక్కడ మాత్రం కారు వేగం మరింత పెరిగింది. మొదటి నుంచీ పార్టీకి గట్టి పట్టున్న షాద్‌నగర్‌, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నంలో వెనుకబడిపోవడానికి కారణాలేమిటనే అంశంపై అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అభ్యర్థుల అతి విశ్వాసం, కుటుంబ సభ్యుల రాజకీయ జోక్యమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

షాద్‌నగర్‌లో ఏం జరిగింది?

షాద్‌నగర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి అంజయ్య యాదవ్‌కు అజాత శత్రువుగా, సౌమ్యుడిగా పేరుంది. తెలంగాణ ఉద్యమంలో చురుకైనా పాత్ర పోషిస్తూ మొదటి నుంచీ కేసీఆర్‌తోనే ఉన్నారు. 2014, 2018లో వరుసగా విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో ప్రత్యర్థి వీర్లపల్లి శంకరయ్య చేతిలో 7,120 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా ఆయన ఈ పదేళ్లలో రూ.4000 కోట్లకుపైగా ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. సౌమ్యుడిగా గుర్తింపు ఉన్న అభ్యర్థిపై జనంలో పెద్దగా వ్యతిరేకత లేదు కానీ కుటుంబ సభ్యుల ఆధిపత్యం, పాలనా పరమైన అంశాల్లో అతి జోక్యమే ఆయన ఓటమికి కారణమన్న చర్చ నడుస్తోంది. చౌదరిగూడ మండలం మినహా కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్‌లో ఆశించిన ఓట్లు రాలేదు. కేవలం చౌదరిగూడలో 1,494 ఓట్ల మెజారిటీ వచ్చింది. సొంత మండలమైన కేశంపేటలో బీఆర్‌ఎస్‌ కంటే కాంగ్రెస్‌కే అధికంగా రావడం గమనార్హం. నందిగామ నుంచి మాజీ జెడ్పీ వైస్‌ చైర్మన్‌ నవీన్‌రెడ్డి, కొత్తూరు కాంగ్రెస్‌ టికెట్‌ ఆశించి భంగపడిన శ్రీనివాస్‌గౌడ్‌ వంటి వాళ్లను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నా.. ఫలితం లేకుండా పోయింది.

'పట్నం'లో పుట్టి ముంచిందేమిటి?

ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై మొదట్లో ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు. 2014 ఎన్నికల్లో టీడీపీలో విజయం సాధించి, ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలోనే ప్రభుత్వం ఫార్మాసిటీని ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారంతా ఆయనకు వ్యతిరేకమయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ మైనింగ్‌ బాధితులకు అండగా నిలవలేదనే అపవాదు కూడా ఆయనపై ఉంది. ఈ పదేళ్లలో నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.2,029 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు అభివృద్ధి పనులు చేయించారు. కలెక్టరేట్‌ సహా ఫాక్స్‌కాన్‌ వంటి ప్రముఖ కంపెనీలను ఇక్కడికి తీసుకురావడంలో చురుకైన పాత్ర పోషించారు. అయినప్పటికీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి చేతిలో పరాజయాన్ని చవి చూడాల్సి వచ్చింది. చివరికి ఆయన సొంత గ్రామమైన ఎలిమినేడులోనూ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు రావడం విశేషం.

కల్వకుర్తిలో వర్గ పోరే కొంపముంచిందా..?

కల్వకుర్తిలో నియోజకవర్గంలో సంస్థాగతంగా బీఆర్‌ఎస్‌ పార్టీ బలోపేతంగా ఉన్నప్పటికీ నేతల మధ్య నెలకొన్న వర్గపోరు ఆ పార్టీ కొంపముంచింది. అభ్యర్థి గుర్క జైపాల్‌ యాదవ్‌ నాయకత్వాన్ని మొదటి నుంచి పార్టీలోని ఓవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. నిత్యం నియోజకవర్గంలోనే పర్యటించినప్పటికీ.. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేయించిన దాఖలాలు పెద్దగా లేకపోవడం ఓటమికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి రూ.500 కోట్లు తీసుకొచ్చి, నియోజకవర్గం అభివృద్ధి చేసినట్లు చెబుతున్నా.. సకాలంలో ఆయా పనులు పూర్తి చేయించలేదనే అపవాదు ఉంది. ఎమ్మెల్యే తీరు నచ్చక ఎమ్మెల్సీ సహా చాలా మంది పార్టీని వీడాల్సి వచ్చింది. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ఆ పార్టీ అధినేత అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు నేతలకు నామినేటెడ్‌ పదవులను కట్టబెట్టినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. ఫలితంగా కాంగ్రెస్‌ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి చేతిలో పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా, ఏ ఒక్క మండలంలోనూ ఆయనకు మెజార్టీ రాలేదు. సొంత గ్రామమైన చల్లంపల్లిలోనూ మూడో స్థానంలోనే నిలవడం గమనార్హం.

మొదటి విడతలో లేనట్లే!

సిటీలో ఎమ్మెల్సీల కోటాలోనే అవకాశం

- ఎమ్మెల్యేల జాబితాలో మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు..
- సామాజిక సమీకరణలపై కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌ హైదరాబాద్‌లో మంత్రి పదవి వరించేదెవరిని...ఎవరికి ఆ అవకాశం లభించనుంది అంటే ఇప్పట్లో గ్రేటర్‌ నుంచి మంత్రి పదవి లేనట్లే అని తెలుస్తోంది. తెలంగాణ అంతటా విజయదుందుభి మోగించినా గ్రేటర్‌ ఓటర్లు కాంగ్రెస్‌కు మొండిచేయి చూపారు. దీంతో ఇక్కడి నుంచి ఇప్పుడు మంత్రి పదవి ఎవ్వరికీ లభించకపోవచ్చుననే కాంగ్రెస్‌ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. రెండో విడుత కేటాయింపుల్లో భాగంగా ఎమ్మెల్సీ కోటాలో మాత్రమే హైదరాబాద్‌ నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు మంత్రి పదవులను కేటాయించవచ్చు. మరోవైపు ఇప్పటికిప్పుడు ఒకవేళ మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే శివార్లలోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆ ఛాన్స్‌ దక్కే అవకాశం ఉంది. కానీ తెలంగాణలోని వివిధ జిల్లాల్లో సామాజిక వర్గాల వారిగా పదవులను కేటాయించవలసి ఉంటుంది. ఇప్పటికే ఈ దిశగా కాంగ్రెస్‌ కసరత్తును చేపట్టింది. ఈ క్రమంలో ఒకే సామాజిక వర్గానికి ఎక్కువ పదవులు కట్టబెట్టారనే చెడ్డపేరు రాకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ఆ రకంగా మల్‌రెడ్డికి ఈ దఫా అవకాశం లభించకపోవచ్చునని ఆ పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేసేందుకు ప్రస్తుతం అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్సీలుగా ఎంపికైన తరువాత మాత్రమే నగరం నుంచి మంత్రి పదవి లభించే అవకాశం ఉంది.

ఆ చాన్స్‌ వరించేదెవరినో?

పదవీకాలం ముగిసిన వారితో పాటు, గవర్నర్‌ కోటా కింద త్వరలో ఎమ్మెల్సీల ఎంపిక జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు, తాము గెలిచే స్థానాలను త్యాగం చేసి మరో చోట పోటీ చేయడంతో ఓడిన వాళ్లు, ఎంతోకాలంగా కాంగ్రెస్‌కు సేవ చేస్తున్న సీనియర్‌లకు ఎమ్మెల్సీ పదవులను కేటాయించవలసి ఉంటుంది. ఈ జాబితాలో అంజన్‌కుమార్‌ యాదవ్‌, మధుయాష్కీగౌడ్‌, కేఎల్‌ఆర్‌, విజయారెడ్డి, వెన్నెల తదితరులు ఉన్నారు. అంజన్‌కుమార్‌ యాదవ్‌ సీనియర్‌ నాయకుడు. అలాగే ఆ సామాజిక వర్గం దృష్టిలో చూసినా ఎంతో ప్రాధాన్యం ఉన్న నేత కావడంతో ఆయనకు అవకాశం లభించవచ్చునని అంటున్నారు. మరోవైపు పోటీచేసి ఓడిపోవడమే కాకుండా, పార్టీలో క్రియాశీల నాయకుడిగా గుర్తింపు కలిగిన మధుయాష్కీ కూడా కీలకమే. ఇక మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యతను ఇవ్వదలిస్తే ఖైరతాబాద్‌ నుంచి పోటీ చేసి ఓడిపోయిన విజయారెడ్డిని ఎంపిక చేయవలసి ఉంటుంది. మరి కొందరు సీనియర్లు కూడా ఎమ్మెల్సీ పదవుల కోసం పోటీ పడే అవకాశం ఉంది. ఇలా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు హైదరాబాద్‌ నుంచి ఇప్పటికిప్పుడు మంత్రి పదవి ఎవ్వరికీ లభించకపోవచ్చుననే గట్టిగా వినిపిస్తోంది. ఎమ్మెల్సీల ఎంపికకు మరికొంత సమయం ఉన్న దృష్ట్యా ఆ ఛాన్స్‌ ఎవరిని వరించనుందో..వేచి చూడవలసిందే.

11,247

నోటాకు వచ్చిన ఓట్లు

షాద్‌నగర్‌: ఈసారి ఎన్నికల్లోనూ నోటా (ఎవరూ నచ్చలేదు)కు జిల్లా వ్యాప్తంగా చాలా ఓట్లు వేశారు. ప్రతి ఈవీఎం బాక్సులో చివరన ఉండే నోటా గుర్తుకు తెలిసో, తెలియక కొందరు.. అన్నీ తెలిసి ఏ అభ్యర్థి నచ్చని పరిస్థితుల్లో మరికొందరు ఓటు వేశారు. జిల్లాల్లోని ఆరు నియోజకవర్గాల్లో 11,247 ఓట్లు నమోదు కావడం గమనార్హం.

నియోజకవర్గం	నోటాకు వేసిన ఓట్లు
షాద్‌నగర్‌	1,389
ఇబ్రహీంపట్నం	1,427
మహేశ్వరం	2,031
రాజేంద్రనగర్‌	1,832
శేరిలింగంపల్లి	3,145
చేవెళ్ల	1,423



ఎల్లా హోటల్‌ ఎదుట గుమిగూడిన కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, అభిమానులు

'ఎల్లా' ఎదుట సందడి

- సీఎల్పీ సమావేశంతో రోజంతా నేతల హడావుడి
- గచ్చిబౌలికి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

గచ్చిబౌలి: ఎన్నికల సమరంలో కాంగ్రెస్‌ పార్టీ విజయం సాధించిన తరువాత అందరి చూపు 'ఎల్లా' హోటల్‌ వైపు మళ్లింది. కౌంటింగ్‌ ముగిసిన వెంటనే ఏఐసీసీ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో క్యాంపు ఏర్పాటు చేశారు. సీఎం రేసులో ఉన్న వారు, ఎమ్మెల్యేలంతా ఆదివారం రాత్రే ఇక్కడికి చేరుకున్నారు. అయితే..ఎమ్మెల్యేల రాక ఆలస్యం కావడంతో సీఎల్పీ సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు. ఈమేరకు ఉదయం 9.30 గంటలకు సీఎల్పీ సమావేశం ప్రారంభమవుతుందని తెలియడంతో వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్‌ నాయకులు గచ్చిబౌలికి తరలి వచ్చారు. ఓ వైపు ఏఐసీసీ ప్రతినిధులు, ఎమ్మెల్యేల రాకతో ఎల్లా హటల్‌ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులను మాత్రమే లోపలికి అనుమతించారు. మీడియాను ప్రధాన ద్వారం వద్దకే పరిమితం చేశారు. ఓ వైపు నాయకుల రాక, మరో వైపు వచ్చిన ఎమ్మెల్యేలు, ఏఐసీసీ ప్రతినిధులతో మీడియా ప్రతినిధులు మాట్లాడటంతో హడావుడి నెలకొంది.

భారీ బందోబస్తు

సీఎల్పీ సమావేశం మధ్యాహ్నం ముగిసినా ఎమ్మెల్యేలు మాత్రం ఎల్లా హోటల్‌కే పరిమితమయ్యారు. పోలీసులు ఆదివారం రాత్రి, సోమవారం పగలంతా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇండియన్‌ బిజినెస్‌ స్కూల్‌ నుంచి ట్రిపుల్‌ ఐటీ వైపు వచ్చే వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది. అక్కడే ఉన్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సిటీలో 'హస్త'వ్యస్తం!

దశాబ్ద కాలంగా బోణీ కొట్టని కాంగ్రెస్‌

- సిటీజనుల మనసు దోచని హస్తం నేతలు
- వైఎస్‌ హయాంలోనే పార్టీ హవా
- మూడు పర్యాయాలుగా ఖాతా తెరవని వైనం..

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో అనుకూల పవనాలతో అధికారం 'హస్త'గతమైనప్పటికీ రాజధాని హైదరాబాద్‌ మాత్రం కాంగ్రెస్‌ను దూరం పెట్టింది. దశాబ్ద కాలంగా ఈ పార్టీకి ఇక్కడ ఆదరణ లభించడం లేదు. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన మూడో ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ ఖాతా తెరవకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వాస్తవంగా పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లో ఖాతా తెరవడం కాంగ్రెస్‌ పార్టీకి కత్తి మీద సాము కాగా, కోర్‌సిటీలో సైతం అదే పరిస్థితి నెలకొంది. దివంగత నేత వైఎస్‌ఆర్‌ హయాంలో మాత్రమే కాంగ్రెస్‌ హవా కొనసాగింది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. గత మూడు పర్యాయాలుగా కనీసం ఖాతా తెరవని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఈసారి అధికారమే లక్ష్యంగా పావులు కదిపిన కాంగ్రెస్‌ అంతటా సత్తాచాటినా.. హైదరాబాద్‌ ఫలితాలు మాత్రం ఖంగుతినిపించాయి. పాతబస్తీతో పాటు కోర్‌సిటీ సెగ్మెంట్లలో గట్టిపోటీకి ప్రయత్నించినా..ఫలిత మాత్రం దక్కలేదు. అన్నింటిలో ఓటమి చవిచూడాల్సి వచ్చింది.

దశాబ్దకాలంగా..

దశాబ్ద కాలంగా కాంగ్రెస్‌ పార్టీ వరుస అపజయాలతో పూర్తిగా పట్టు కోల్పోయింది. కనీసం సంస్థాగతంగా నాయకత్వం కూడా కరువైంది. హైదరాబాద్‌ను ఖైరతాబాద్‌, హైదరాబాద్‌, సికింద్రాబాద్‌ జిల్లాలుగా విభజించి సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నించినా సాధ్యంకాని పరిస్థితి నెలకొంది. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, మేనిఫెస్టో, డిక్లరేషన్‌లు సైతం నగరవాసులను ఆకర్షించలేకపోయాయి. బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సర్వేలపై సర్వేలు నిర్వహించి పారాచ్యూట్‌లకు సైతం అవకాశం ఇచ్చినా..ఎన్నికల్లో బోల్తా పడక తప్పలేదు. పలు అసెంబ్లీ స్థానాల్లో మూడు, నాల్గవ స్థానాలకు పరిమితమైంది. వాస్తవంగా 2009లో వైఎస్‌ హయాంలో ముషీరాబాద్‌, ఖైరతాబాద్‌, సనత్‌నగర్‌, జూబ్లీహిల్స్‌, గోషామహల్‌, సికింద్రాబాద్‌, కంటోన్మెంట్‌ సెగ్మెంట్లు కాంగ్రెస్‌ విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పూర్తిగా చతికిలపడింది. 2014లో జరిగిన ఎన్నికల్లో సిట్టింగ్‌ స్థానాలనుసైతం దక్కించుకోలేక పోయింది. 2018 ఎన్నికల్లో టీడీపీ, టీజేఎస్‌తో కలిసి కూటమిగా పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అన్ని స్థానాల్లో అపజయాన్ని మూటగట్టుకుంది. పదేళ్లలో రెండు పర్యాయాలు జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగినా..అందులోనూ సైతం మొక్కుబడి స్థానాలకు పరిమితమైంది.

నాయకత్వ లోపం..

కాంగ్రెస్‌ పరిస్థితి దిగజారడానికి ప్రధాన కారణం నాయకత్వ లోపమే. నగర అధ్యక్షుల ఎంపికలో ఆలస్యం..సీనియర్ల మధ్య సమన్వయలేమి కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చింది. 2014, 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ, 2020లో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నా అధిష్టానం సమీక్షించుకోకపోవడం దారుణం. రాష్ట్ర పార్టీ సీనియర్లలో నెలకొన్న వివాదాలు కూడా నగరపార్టీపై తీవ్ర ప్రభావం చూపాయి.దీంతో నగర కాంగ్రెస్‌ ఆ నాథగా మారింది. దీని ప్రభావమే తాజా ఎన్నికల్లో నూ ఖాతా తెరవకుండా పోవడానికి దారితీసింది.

'లింకుల'తోనే ముప్పు

అన్నీ డేంజర్‌ కాల్స్‌ కాదు..

- తరచూ వస్తున్న '+ నంబర్‌' కాల్స్‌
- 'వెరిఫికేషన్‌' కోసమూ కొన్ని ఫోన్లు
- వీడియో కాల్స్‌ జోలికి మాత్రం వెళ్లొద్దు
- సైబర్‌ నిపుణుల సూచన

సాక్షి, సిటీబ్యూరో: '+నెంబర్ల....' తో వస్తున్న ఫోన్‌ కాల్స్‌ అంటే ప్రస్తుతం అందరికీ హడల్‌. ఇవి ఎత్తితే తమ ఫోన్‌ ఎదుటి వారి ఆధీనంలోకి వెళ్లిపోతుంది, బ్యాంకు ఖాతా మొత్తం ఖాళీ అవుతుందని భయపడుతున్నారు. డీప్‌ ఫేక్‌ సైబర్‌ క్రైమ్స్‌ వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే చాలు హడలిపోతున్నారు. ప్రతి '+' కాల్‌ ప్రమాదకరం కాదని సైబర్‌ నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి నెంబర్లతో వచ్చే వీడియో కాల్స్‌ జోలికి మాత్రం వెళ్లకపోవడం ఉత్తమమని స్పష్టం చేస్తున్నారు.

నంబర్ల డేటా కోసం బల్క్‌ కాల్స్‌..

ఇటీవలి కాలంలో మార్కెటింగ్‌ స్ట్రాటజీలు పూర్తిగా మారిపోయాయి. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలకు పోటీగా ఆయా వ్యాపార సంస్థలు అనేక మార్గాలు అనుసరిస్తున్నాయి. వీటిలో బల్క్‌ ఎస్సెమ్మెస్‌లు, వాట్సాప్‌ మెసేజ్‌లు, ఇంటరాక్టివ్‌ వాయిస్‌ రెస్పాన్స్‌ సిస్టం (ఐవీఆర్‌ఎస్‌) కాల్స్‌, రికార్డెడ్‌ కాల్స్‌ వంటివి పెరిగాయి. ఇవన్నీ చేయాలంటే ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల ఫోన్‌ నెంబర్లు కీలకం. ఈ డేటా ఎవరి వద్ద ఎక్కువగా, పక్కాగా ఉంటుందో ఆ మార్కెటింగ్‌ ఏజెన్సీలకే డిమాండ్‌ ఉంటుంది. అయితే ఆయా సంస్థల కోసం పని చేసే ఏజెన్సీలు తమ వద్ద ఉన్న ఫోన్‌ నెంబర్ల డేటాను చెక్‌ చేసుకోవడానికి ఇంటర్‌నెట్‌ బల్క్‌ కాల్స్‌ వాడుతుంటారు. సదరు ఫోన్‌ నెంబర్‌ పని చేస్తోందా? లేదా? అనేది తెలుసుకోవడానికి చేసే ఇంటర్‌నెట్‌ బల్క్‌ కాల్స్‌ అన్నీ '+ నంబర్ల'తోనే వస్తుంటాయి.

వీడియో కాల్స్‌తో ఇబ్బందే..

ఇటీవల కాలంలో డీప్‌ ఫేక్‌ అనే సైబర్‌ నేరాలు జరుగుతున్నాయి. ఓ వ్యక్తి వాయిస్‌, ఫొటో, వీడియోలను వినియోగించి వారు చేసినట్లే వారి సంబంధీకులకు కాల్స్‌ చేసి మోసం చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు మాత్రం ముందుగా సదరు వ్యక్తికి ఇంటర్‌నెట్‌ కాల్‌ చేయడం ద్వారా అతడి వాయిస్‌ సంగ్రహిస్తారు. దాన్ని వినియోగించే డీప్‌ ఫేక్‌ కాల్‌ చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే '+నెంబర్ల' కాల్స్‌ వచ్చినప్పుడు వాటిని ఎత్తినా సరే స్పష్టత వచ్చే వరకు మాట్లాడకపోవడం ఉత్తమమని సైబర్‌ నిపుణులు చెప్తున్నారు. కేవలం ఫోన్‌ కాల్‌, ఎస్సెమ్మెస్‌, వాట్సాప్‌ సందేశం ఆధారంగా ఆర్థిక లావాదేవీలు మాత్రం చేయవద్దని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క గుర్తుతెలియని, '+ నెంబర్ల'తో వచ్చే వీడియో కాల్స్‌ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇలా వచ్చే వీడియో కాల్స్‌తో ఎదుటి వారి వీడియోలను రికార్డు చేసే సైబర్‌ నేరగాళ్లు డీప్‌ ఫేక్‌తో పాటు మార్ఫింగ్‌ చేయడం ద్వారా సెక్స్‌ట్రాప్‌ క్రైమ్‌ కోసమే వినియోగిస్తారని హెచ్చరిస్తున్నారు.

ఆడియో కాల్‌తో ఇబ్బంది ఉండదు..

సైబర్‌ నేరగాళ్లు సహా ఎవరైనా సరే ఒక్క ఎస్సెమ్మెస్‌ పంపడం ద్వారానో, ఫోన్‌ కాల్‌ చేయడం ద్వారానో నేరం చేసేస్తారని అనుకుంటే పొరపాటే. ఆయా ఎస్సెమ్మెస్‌లు, వాట్సాప్‌ మెసేజ్‌ల్లో ఉన్న లింకుల్ని క్లిక్‌ చేస్తే మాత్రమే ఇవతలి వ్యక్తి ఫోన్‌ ఎదుటి వారి ఆధీనంలోకి వెళ్లిపోతుంది. ఫోన్‌లో ఉన్న డేటాను సంగ్రహించాలన్నా ఏపీకే ఫైల్స్‌తో కూడిన లింకుల్ని పంపాల్సిందే. అలా కాకుండా ఎస్సెమ్మెస్‌ లేదా వాట్సాప్‌ సందేశాన్ని చూసినంత మాత్రాన సాధారణంగా ఎలాంటి ముప్పు ఉండదు. అయితే ఇటీవల కాలంలో డార్క్‌నెట్‌ ద్వారా అందుబాటులోకి వచ్చిన మాల్‌వేర్స్‌ మాత్రం ప్రమాదకరంగా మారాయి. దాంతో కూడిన సందేశం టార్గెట్‌ చేసిన వ్యక్తి ఫోన్‌కు చేరితే చాలు హ్యాక్‌ చేయడం సాధ్యమవుతోంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌ కాల్స్‌ ద్వారా ఎదుటి వారి ఫోన్‌ను ఎవరూ తమ ఆధీనంలోకి తీసుకోలేరని, ఏ కాల్‌ ద్వారానూ ఇది సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే '+ నంబర్ల'తో వచ్చే కాల్స్‌ పట్ల ఉన్న అపోహలు తొలగించుకోవాలని సూచిస్తున్నారు.



యువకుడి అదృశ్యం


శివకుమార్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఈజమల్ల రాంకోటి కుమారుడు శివకుమార్ (24) నగరంలో సీసీ కెమెరాల పని నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 15న ఇంటి నుంచి వెళ్లిన శివకుమార్ తిరిగి రాలేదు. గతంలోనూ ఇదే మాదిరిగా వెళ్లిన శివకుమార్ రెండు నెలల తర్వాత ఇంటికి వచ్చాడు. ఈ సారి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వాకబు చేయగా ఫలితం లభ్యమవ్వలేదు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో ఆందోళనకు గురైన శివకుమార్ తండ్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బోరు మోటార్‌లో రాళ్లు వేసిన దుండగులు


మరమ్మతులు చేస్తున్న రైతులు

దోమ: గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లలో చిన్న పగుళ్ల రాళ్లు వేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమె మైసయ్యకు చెందిన బోరు మోటార్‌లో ఆదివారం రాత్రి దుండగులు రాళ్లు వేశారు. ఉదయాన్నే పంటకు నీరు పెడుదామని ఆయన బోరు వేసేందుకు వెళ్లాడు. అందులో రాళ్లు వేయడంతో అది పాడైపోయింది. దీంతో బాధిత రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అధికారులు చొరవ తీసుకొని మోటారులో రాళ్లు వేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

ముక్కలైన ‘గాజు గ్లాసు’

తాండూరులో డిపాజిట్ కోల్పోయిన జనసేన

తాండూరు: తాండూరులో గాజు గ్లాసు ముక్కలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీ పొత్తులో భాగంగా తాండూరు స్థానాన్ని జనసేన పార్టీకి చెందిన నేత నేమూరి శంకర్‌గౌడ్‌కు కేటాయించారు. బీజేపీ మద్దతు లభిస్తోందని ఎంతో ఆశతో వచ్చిన శంకర్‌గౌడ్ నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారంలోకి దిగారు. అయితే బీజేపీ మద్దతు అంతంత మాత్రంగానే లభించింది. గతంలో తాండూరు నుంచి బీజేపీ పార్టీ నుంచి ఎవరు పోటీ చేసినా 10 వేలకు పైచిలుకు ఓట్లు వచ్చాయి. అయితే ఈ ఎన్నికలలో మాత్రం బీజేపీ శ్రేణులు జనసేన పార్టీకి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో నేమూరి శంకర్‌గౌడ్‌కు కేవలం 4,087 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో జనసేన డిపాజిట్ కోల్పోయింది.

‘ఏనుగు’కు దూరంగా బహుజనం

గత రెండేళ్లుగా తాండూరు నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ విస్తృతంగా పర్యటిస్తు వచ్చారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలంగా మార్చుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే బహుజన సమాజ్ పార్టీకి బహుజనుల మద్దతు అనుకూలిస్తోందని ఎంతో ఆశపడ్డారు. అయితే కౌంటింగ్ రోజు మాత్రం బీఎస్పీ నాయకులు ఆశించిన స్థాయి ఫలితాలు రాలేదు. కేవలం 2,546 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. స్థానికుడు అయిన బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్ కంటే స్థానికేతరుడైన జనసేన పార్టీ అభ్యర్థికి అధికంగా ఓట్లు రావడం విశేషం.

ఇంట గెలిచారు!

- సొంత గ్రామాల్లో సత్తాచాటిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు
- వీర్లపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేటలో భారీగా నమోదైన పోలింగ్

షాద్‌నగర్: సొంతూరు నుంచి ప్రస్థానం ప్రారంభించిన నేతలెందరో ఉన్నతంగా ఎదిగారు. ప్రతిపక్ష నాయకుల మాటలను తిప్పి కొట్టేందుకు వారి ఊరును అభివృద్ధిలో చక్కబెట్టుకుని క్రమ క్రమంగా ప్రయాణం సాగిస్తుంటారు. గ్రామ ఓటు బ్యాంకు సైతం గెలుపోటములను శాసిస్తాయనడంలో సందేహమే అవసరం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు కాంగ్రెస్ అభ్యర్థిగా వీర్లపల్లి శంకర్, బీఆర్ఎస్ నుంచి అంజయ్య యాదవ్ పోటీ పడ్డారు. వారి వారి స్వగ్రామాల్లో వారిదే పై చేయిగా నిలిచింది.

- కాంగ్రెస్ అభ్యర్థి శంకర్ గ్రామం వీర్లపల్లిలో 1175 మంది హస్తానికి, 834 మందికి కారుకు ఓటేశారు.
- బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ గ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో కారుకు 972 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్‌కు 493 మంది ఓటేశారు.

అధిక శాతం పోలింగ్ నమోదు

బరిలో ఉన్న అభ్యర్థుల సొంత గ్రామాల్లో ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో పోలింగ్ శాతం భారీగా నమోదైంది. నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,525 మంది ఓటర్లు ఉండగా 2,227 ఓట్లు పోలయ్యాయి. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,725 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,558 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సొంత గ్రామాల్లో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నించడం, అభ్యర్థులకు చెందిన మద్దతు దార్లు ఓటర్లను చైతన్యం చేయడం, నేను మీఊరి వాడినే గెలిపిస్తే ఊరు మరింత అభివృద్ధి చెందుతుందని అభ్యర్థులు హామీలు ఇవ్వడం తదితరాలు ఓటింగ్ శాతం పెంపునకు కారణమయ్యాయి.


వీర్లపల్లి శంకర్


అంజయ్య యాదవ్

నోటాకు ఓటేశారు

ఎన్నికల సంఘం పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించింది. ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సొంత గ్రామాల్లోనూ పలువురు ఓటర్లు అభ్యర్థులెవరు నచ్చకపోవడంతో నోటాకు ఓటేశారు. వీర్లపల్లిలో 11 మంది, ఎక్లాస్‌ఖాన్‌పేటలో 8 మంది ఓటర్లు నోటాకు ఓటేశారు.

‘గులాబీ’ కోటలో హస్తం పాగా

- పరిగిలో భారీగా క్రాస్ ఓటింగ్
- స్థానిక నాయకులపై అసమ్మతే కారణం

పరిగి: పరిగి నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల తీర్పు కాంగ్రెస్ వైపే ఉండటం గమనార్హం. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలా ఉన్న మండలాలు సైతం ఈసారి కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లడంతో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని చెప్పవచ్చు. పరిగి, పూడూర్, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాలు ఉండగా మొత్తం ఓటర్లు 2,59,422 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో 1,98,547 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోగా 76.53శాతం పోలింగ్ నమోదు అయింది. 2018 కంటే ఈ ఎన్నికల్లో ఓటర్లు పెరగడం, పోలింగ్ శాతం పెరగడంతో బీఆర్ఎస్ గెలుపుపై ధీమాగా ఉంది. అంతే కాకా 2018లో ఎమ్మెల్యేగా మహేశ్‌రెడ్డి ఎన్నికైన నాటి నుంచి ప్రజల్లో ఉండటంతో మరింతగా ఊరట నిచ్చింది. కానీ ఈసారి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైపు ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని ప్రజలు భారి మెజారిటీతో గెలిపించారు.

అన్ని మండలాల్లో ఆధిక్యం

నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ బూత్‌లు ఉండగా అన్నింటిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ 14 టేబుల్స్‌లను ఏర్పాటు చేసి 22 రౌండ్‌లలో కొనసాగించారు. మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి దోమ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి 12,636 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 15,773 ఓట్లు వచ్చాయి. గండీడ్‌లో బీఆర్ఎస్‌కు 7873 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 11,172 ఓట్లు పోలైయ్యాయి. మహ్మదాబాద్‌లో బీఆర్ఎస్‌కు 6897 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 11,258 ఓట్లు వచ్చాయి. కుల్కచర్లలో బీఆర్ఎస్ పార్టీకి 8326 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీకి 11,270 ఓట్లు పోలైయ్యాయి. చౌడాపూర్‌లో బీఆర్ఎస్‌కి 8715 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 10,347 ఓట్లు వచ్చాయి. పరిగి మండలంలో బీఆర్ఎస్‌కు 16,490 ఓట్లు, కాంగ్రెస్‌కు 20,826 ఓట్లు వచ్చాయి. ప్రతి మండలంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థిపై 24,012 ఓట్ల మెజారిటీతో రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు.

ఓటింగ్ శాతం పెంచుకున్న బీజేపీ

ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటి కొనసాగుతూ వచ్చింది. ఈసారి బీజేపీ పార్టీ కూడా గట్టిగానే పోటి చేసి తమ సత్తా చాటాలని భావించింది. కానీ బీజేపీ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించకపోయినా గతం కంటే ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది. నియోజకవర్గంలోని 7మండలాల్లో దాదాపుగా 80శాతం పైగా ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నప్పటికి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రావడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి క్రాస్ ఓటింగ్ నిర్వహించారని ప్రచారం జరుగుతుంది. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో ఒకరిద్దరు ముఖ్య నాయకుల వల్లే ఇది జరిగిందని నియంత పాలన చేయడంతోనే వ్యతిరేక వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ధారూరులో కాంగ్రెస్ హవా

బీఆర్ఎస్‌కు గండి

ధారూరు: ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. ధారూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోటగా మారింది. మండలం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో 1,105 ఓట్లు కాంగ్రెస్‌కు లీడ్ రాగా, ఈసారి మాత్రం 2,774 లీడ్ సాధించి బీఆర్ఎస్‌ను గండి కొట్టింది. కారు పార్టీ బడా నాయకులు ఉన్న గ్రామాల్లోనే కాంగ్రెస్ పార్టీకి లీడ్ రావటం చర్చనీయాంశమైంది. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ గ్రామమైన కేరెళ్లితో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులున్న ధారూరు, తరిగోపుల, దోర్నాల్, నాగసమందర్, నాగారం, మోమిన్‌కలాన్ బూత్‌లో కాంగ్రెస్ కన్నా బీఆర్ఎస్ వెనకంజలో నిలిచింది. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో హస్తానికి లీడ్ రాగా కేవలం 8 గ్రామాల్లో బీఆర్ఎస్‌కు లీడ్ రావడంపై ఆ పార్టీ నాయకులు కంగుతిన్నారు.

కాంగ్రెస్‌కు ఆధిక్యం ఇచ్చిన గ్రామాలు

కేరెళ్లిలో 94 ఓట్లు, నాగసమందర్‌లో 699, ధారూరులో 405, గట్టెపల్లి 29, కుక్కిందలో 232, అల్లాపూర్‌లో 55, ధర్మాపూర్, నర్సాపూర్‌లలో 52 చొప్పున, కొండాపూర్‌కలాన్‌లో 70, మున్నూరుసోమారంలో 186, రాంపూర్‌తండాలో 232, స్టేషన్ ధారూరులో 154, చింతకుంటలో 121, హరిదాస్‌పల్లిలో 80, నాగారంలో 69, తరిగోపులలో 56, అంతారంలో 167, దోర్నాల్‌లో 13, గురుదోట్లలో 64, పీసీఎంతండాలో 163, అంపల్లిలో 19, మోమిన్‌కలాన్‌లో 37, మోమిన్‌ఖుర్దులో 8 ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి.

బీఆర్ఎస్‌కు..

రాజాపూర్‌లో 6 ఓట్లు, నాగ్‌సాన్‌పల్లిలో 51, మైలారంలో 175, అల్లిపూర్‌లో 72, ఎబ్బనూర్‌లో 41, రుద్రారంలో 33, గడ్డమీది గంగారంలో 44, అవుసుపల్లి బూత్‌లో 7 ఓట్లు బీఆర్ఎస్ లీడ్‌లో నిలిచింది.

మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కే !

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ముస్లిం మైనార్టీ ఓట్లు నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద మొత్తంలో బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపాయి. 2018 ఎన్నికల్లోనూ వారిలో అత్యధికంగా బీఆర్ఎస్‌కే ఓటు వేసినా.. ఇటీవల కర్ణాటకలో మైనార్టీలంతా కాంగ్రెస్‌కు ఓటు వేశారనే ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్, దాని మిత్రపక్షం ఎంఐఎం పార్టీలు చతురత ప్రదర్శించి వారి ఓట్లను కాంగ్రెస్ వైపు వెళ్లకుండా నిరోధించగలిగారు.

- గొలిదొడ్డి నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో ఎంఐఎంకు నామమాత్రంగా నే ఓట్లు వచ్చాయి. గ్రేటర్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో తమకే అత్యధిక ఓట్లు పోలవుతాయని ఎంఐఎం నాయకులు ఆశించారు. పడితే తమకు లేదంటే బీఆర్ఎస్ పడాలని తమ ఎత్తుగడ ప్రకారంగానే ఓటర్లు స్పందించారు. దీంతో 9వ రౌండ్‌గా వెలువడిన అత్తాపూర్ డివిజన్ ఫలితాల్లో ఎంఐఎంకి నామ మాత్రంగా 106 ఓట్లు రాగా.. బీఆర్ఎస్‌కు 5,226, బీజేపీకి 8,285, కాంగ్రెస్‌కు 2,276 ఓట్లు వచ్చాయి.
- 10వ రౌండ్ సులేమాన్‌నగర్ డివిజన్ ఫలితాల్లో ఎంఐఎంకు 6,002, బీఆర్ఎస్‌కు 6,934, కాంగ్రెస్‌కు 2,493, బీజేపీకి 849 ఓట్లు వచ్చాయి.
- 11వ రౌండ్ శాస్త్రిపురం డివిజన్‌లో ఎంఐఎంకు 5,344, బీఆర్ఎస్‌కు 7,602, కాంగ్రెస్‌కు 2,585, బీజేపీకి 89 ఓట్లుగా వచ్చాయి.
- మైలార్‌దేవ్‌పల్లిలోని కొన్ని బూత్‌లతో కలిపి 12వ రౌండ్‌లో ఎంఐఎం పార్టీకి 2,943, బీఆర్ఎస్‌కు 6,002, కాంగ్రెస్‌కు 3,365, బీజేపీకి 2,984 ఓట్లు వచ్చాయి.
- 10, 11వ రౌండ్‌ల ఫలితాలను గమనిస్తే ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల కన్నా అధికంగా బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేశారని స్పష్టం అవుతుంది.
- మైనార్టీల ప్రచారం జరిగినట్టు కాంగ్రెస్‌కు వేసినా.. తమ పార్టీకి భావించి ఎంఐఎంకు వేసినా నియోజకవర్గ ఫలితం మరోలా ఉండేదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- మైనార్టీలు బీఆర్ఎస్‌కు అండగా నిలవడంతోనే శివారు నియోజకవర్గాలు, ముఖ్యంగా ముస్లింలు అధికంగా ఉండే నియోజకవర్గాలు బీఆర్ఎస్ వశం అయ్యాయని వారు చెబుతున్నారు.

ఓటర్లు డబ్బుకు లొంగలేదు

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: బీఆర్ఎస్ నాయకులు పంచిన డబ్బులకు కొడంగల్ ఓటర్లు లొంగలేదని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేయడానికి బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రెండు వేల చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం జరిగిందన్నారు. నగదు పంపిణీ వల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయని అనుమానం పడినట్లు చెప్పారు. అయితే కొడంగల్ ప్రజలు అభిమానానికి, ఆత్మ గౌరవానికి ఓటు వేసినట్లు తెలిపారు. భారీ మెజారిటీతో రేవంత్‌ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాయిలు, ఆనంద్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్ తదితరులు సన్మానం చేశారు.


మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

నో.. ప్రమోషన్ !

ఎవరి పదవుల్లో వారే..


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి


మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా సిట్టింగ్ ప్రజాప్రతినిధులు పోటీ చేసిన విషయం తెలిసిందే. వారిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేశారు. బీజేపీ పార్టీ నుంచి సిట్టింగ్ మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి మణికొండ మున్సిపల్ సిట్టింగ్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్, ఎంఐఎం పార్టీ నుంచి కార్వాన్ సిట్టింగ్ కార్పొరేటర్ స్వామియాదవ్‌లు పోటీ చేశారు. వారిలో ప్రకాష్‌గౌడ్ పదవీకాలం పూర్తవ్వడంతో తిరిగి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయగా.. మిగతా ముగ్గురు సిట్టింగ్ ప్రజాప్రతినిధులుగా ఉంటూ.. మరింత ఉన్నత స్థానమైన ఎమ్మెల్యేకు పోటీ చేశారు. ప్రకాష్‌గౌడ్ కాకుండా ముగ్గురిలో ఏ ఒక్కరు గెలిచినా.. వారి ప్రస్తుత స్థానం మారి ప్రమోషన్ పొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేవారు. కానీ ఓటర్లు దీనికి భిన్నంగా ఎవరి స్థానాల్లో వారే ఉండాలని నిర్ణయించినట్టుంది. ప్రకాష్‌గౌడ్ సైతం ఈసారి గెలుపొందితే నాల్గోసారి అవుతుందని, ప్రభుత్వం వస్తే తనకూ ప్రమోషన్ వచ్చి మంత్రిని అవుతానని అనుకున్నారు. తాను గెలిచి బీఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవటంతో అతడికి ప్రమోషన్ లేకుండా ఉన్న స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని నియోజకవర్గ ఓటర్లు, రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా ఎమ్మెల్యేగా ఓడిపోయిన ముగ్గురికి నియోజకవర్గ వారి పార్టీ ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు రావడంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మాదిరిగానే నియోజకవర్గంలోనూ ప్రతిపక్షం గట్టిగానే ఉండే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

శంషాబాద్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు

శంషాబాద్: రాష్ట్రంలో మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకుని కొత్త ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదయ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీతో సుపరిపాలనకు అడుగులు పడ్డాయని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. సులోచన, శ్రీధర్, శంషుద్దీన్, బొబ్బిలి కిష్టయ్య, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్‌గౌడ్ , సిద్దేశ్వర్‌గౌడ్ గని, జహంగీర్ , పరమేష్, నర్సింహా, నర్సింగ్‌రావు, భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌ఖాన్, సిద్దేశ్వర్‌గౌడ్, దయానంద్, యాదగిరి, కొంకర రాజు పాల్గొన్నారు.

పాపం పసివాడు

నుజ్జునుజ్జయిన కాళ్లు

షాద్‌నగర్: పదేళ్లయినా నిండని పసి భవితవ్యం ముందుకు అడుగు వేయకుండా పోయింది.. అక్షరాల వైపు బుడి బుడి నడకలు వేసే కాళ్లు రక్తపు ముద్దగా మారిపోయాయి. ఈ హృదయ విదారకమైన ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గంగాధర్‌పల్లి గ్రామ పరిధిలోని కుంటలోపుతండాకు చెందిన నీలా, తావుర్యా దంపతులకు ముగ్గురు సంతానం. వీరు రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కుమారుడు అశోక్ (9) నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు సహ విద్యార్థులతో కలిసి రోడ్డుపై వేచిఉన్నారు. షాద్‌నగర్ నుంచి సూరారం వెళ్లే బస్సు రాగానే విద్యార్థులంతా బస్సు వెంట పరుగులు తీశారు. బస్సు ఎక్కే క్రమంలో అశోక్ బస్సు వెనక టైర్ల కింద పడగా బస్సు టైర్లు రెండు కాళ్ల పై నుంచి వెళ్లాయి. దీంతో బాలుడి రెండు కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. బాలుడిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

గంజాయి విక్రేతకు రెండేళ్ల జైలు

శిక్ష విధించిన వికారాబాద్ కోర్టు

ధారూరు: గంజాయితో పట్టుబడ్డ అస్సాం రాష్ట్రానికి చెందిన మిథున్ బిస్వాల్(30)కు వికారాబాద్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీకాంత్ రెండేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధించారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు సమీపంలో రైల్వే వంతెనపై గంజాయి సంచితో మిథున్ 2021 నవంబర్ 8న పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి సీఐ తిరుపతిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మిథున్ బిస్వాల్ గంజాయి గింజలు తీసుకువచ్చి అడవిలో విత్తనాలు చల్లి చెట్లను పెంచుతున్నాడు. 6 నెలలు ఒక ప్రాంతంలో ఉంటే ఆ తర్వాత వేరే ప్రాంతానికి వెళ్లిపోతాడు. అతని వద్ద ఎప్పుడూ గంజాయి విత్తనాలు, ఆకు సిద్ధంగా ఉంటుంది. ముందస్తు సమాచారంతో అప్పట్లో పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి సోమవారం తుది తీర్పు వెలువడిందని పోలీసులు తెలిపారు.

సబితారెడ్డికి శుభాకాంక్షలు

అత్తాపూర్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి పి.సబితారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ చెందిన చిత్తారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు.